Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699



# రాజధాని వార్తలు

## RAJADHANIVARTALU



ఏపి రాజధాని అమరావతి రైతులు ఇప్పటికీ ప్రభుత్వం నుండి తమ వార్షిక కౌలు చెల్లింపుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం వారి వార్షిక కౌలు వీలైనంత త్వరగా చెల్లిస్తుందని ఆశిస్తున్నాను. ప్రభుత్వం మరింత ఆలస్యం చేస్తే అవి సరైన పద్ధతి కాదే కాదు- పి.హుస్సేన్ ఖాన్, ఎం.ఎస్.సి. ఎడిటర్, రాజధాని వార్తలు

rajadhanivartalu@gmail.com
94406 62699

అమరావతి సంపుటి (Vol) : 6 సంచిక (Issue): 363 పేజీలు (Pages): 4 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily)

శుక్రవారం, 20 - 6 - 2025

94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com RNI No.: APTEL/2019/77985 స్థాపితం : 2015

# ఇంగ్లీష్ మాట్లాడే వారు.. సిగ్గు పడే రోజులు ఎంతో దూరంలో లేవు



**న్యూఢిల్లీ:** కేంద్ర హెూమ్ శాఖ మంత్రి అమిత్ షా కీలక వ్యాఖ్యలు చేశారు. ఇంగ్లీషులో మాట్లాడే వారు సిగ్గు పడే రోజులు రానున్నాయన్నారు. ఆ సమయం ఎంతో దూరంలో లేదని ఆయన వ్యాఖ్యానించారు. జాతి ఐక్యతకు భారతీయ భాషలే ఆత్మ అని తెలిపారు. గురువారం న్యూఢిల్లీలో జరిగిన ఒక కార్యక్రమంలో ఐఏఎస్ మాజీ అధికారి అశ్తోష్ అగ్నిహెూత్రి రచించిన పుస్తకాన్ని కేంద్ర మంత్రి అమిత్ షా అవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కేంద్ర మంత్రి అమిత్ షా మాట్లాడుతూ.. దేశంలోని మన భాషలే.. మన సంస్కృతికి రత్నాలు అని అభివర్ణించారు. భాషలు లేకుంటే మనం భారతీయులమే కాదని ఆయన అభిప్రాయపడ్డారు. మన చరిత్ర, మన సంస్కృతి, మన ప్రాంతీయతను అర్థం చేసుకునేందుకు ఏ విదేశీ భాషకు సాధ్యం కాదని స్పష్టం చేశారు. విదేశీ భాషలతో భారతీయ భావనను సంపూర్ణంగా అర్థం చేసుకోలేరన్నారు. మన భాషలతో కూడిన ఆత్మ గౌరవంతో మన దేశం ప్రపంచాన్ని ముందుకు నడిపిస్తుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

# యోగాపై ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ క్లాసెస్ : చంద్రబాబు



**అమరావతి, (రాజధాని వార్తలు):** 11వ యోగా అంతర్జాతీయ దినోత్సవాన్ని ఈనెల 21న విశాఖపట్నంలో నిర్వహిస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. గురువారం యోగాంధ్రపై ముఖ్యమంత్రి మీడియాతో మాట్లాడుతూ.. యోగా జీవితంలో భాగం కావాలన్నారు. ఇది మనకు వారసత్వంగా వచ్చిన సంపద అని తెలిపారు. శస్త్ర చికిత్స కన్నా నివారణ మంచిదని.. యోగా కూడా అలాంటిదే అని అన్నారు. యోగాపై భవిష్యత్తులో ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ శిక్షణ, కోర్సులు నిర్వహిస్తామని చెప్పారు. యోగా నెలను డిక్లేర్ చేయనున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. యోగా కోసం 2 కోట్ల మందిని రిజిస్ట్రేషన్ చేయాలనుకున్నామని.. కానీ 2.30 కోట్ల మంది రిజిస్టర్ అయ్యారన్నారు. 120 శాతం లక్ష్యం సాధించామని చెప్పుకొచ్చారు. 88.71 శాతం మంది ప్రజలు యోగాలో పాల్గొంటున్నారని వెల్లడించారు. విశాఖలో ప్రపంచ యోగా దినోత్సవం పెద్ద ఈవెంట్‌గా నిర్వహించబోతున్నామని.. ఇది గిన్నిస్ బుక్‌లో ఎక్కబోతుందన్నారు. బాడీ ఫిట్‌నెస్‌కు, వ్యాధులు రాకుండా నిరోధించేందుకు యోగా ఉపయోగపడుతుందన్నారు. వ్యాధులు వస్తే మెడిసిన్స్ వాడటం, శస్త్ర చికిత్సలు చేయించుకోవడం మంచిది కాదన్నారు. గత నెల రోజులు నుంచి చేపట్టిన యోగా కార్యక్రమం బాగా జరిగిందన్నారు. దాదాపు 1 కోటి 77 లక్షల మంది వచ్చి యోగాలో పాల్గొన్నారని తెలిపారు. గ్రామ, మండల స్థాయిలో పెట్టిన శిబిరాల్లో అందరూ పాల్గొన్నారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించాలి అనుకున్న యోగ కార్యక్రమాలు లక్ష్యాన్ని మించి సాధించామన్నారు. రాష్ట్రంలో 1 లక్ష 29 వేల ప్రాంతాల్లో యోగా చేస్తున్నారన్నారు. విశాఖలో 26 కిలోమీటర్ల పరిధిలో 3 లక్షల 19 వేల మంది యోగా చేసే విధంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. విశాఖలో 326 కంపార్ట్మెంట్లు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ప్రివెంటివ్ హెల్త్‌కు యోగా చాలా బెస్ట్ మెడిసిన్ అని.. దీనిని అందరూ అలవర్చుకోవాలని సీఎం చంద్రబాబు సూచించారు.

# విశాఖ తీరంలో చేపల వేటపై ఆంక్షలు.. ఎందుకంటే..

**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** విశాఖపట్నం సముద్ర తీరంలో చేపల వేటపై ప్రభుత్వం ఆంక్షలు విధించింది. జూన్ 21వ తేదీ అంతర్జాతీయ యోగా దినోత్సవం. విశాఖపట్నం వేదికగా ఈ కార్య క్రమం భారీ ఎత్తున రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తుంది. ఈ కార్యక్ర మానికి ప్రధాని నరేంద్ర మోదీ ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు. ఈ నేపథ్యంలో విశాఖపట్నం తీరంలో జూన్ 20, 21వ తేదీల్లో అంటే.. శుక్రవారం, శనివారం చేపల వేటపై ఆంక్షలు విధించారు. ఈ రెండు రోజుల్లో ఫిషింగ్ హార్బర్ నుంచి భీమిలి వరకు చేపల వేటపై నిషేధం విధించినట్లు ఉన్నతాధికారులు వెల్లడించారు. ప్రధాని మోదీ పర్యటన నేపథ్యంలో భద్రతను కట్టుదిట్టం చేశారని.. అందులో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరణ ఇచ్చారు. ఈ ఏడాది అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పెద్ద ఎత్తున నిర్వహించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. విశాఖపట్నం వేదికగా నిర్వహించే ఈ కార్యక్రమానికి దాదాపు ఐదు లక్షల మంది ప్రజలు తరలి రానున్నారు. అందుకు తగ్గట్లుగా ప్రభుత్వం ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ కార్యక్రమానికి ప్రధాని మోదీ హాజరు కానున్నారు. ఈ నేపథ్యంలో విశాఖపట్నంలో భద్రతను కట్టుదిట్టం చేశారు. మరోవైపు.. సముద్రంలో మత్స్య సంపద వృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం విధించిన



రెండు నెలల నిషేధ కాలం శనివారంతో అంటే.. జూన్ 14వ తేదీతో ముగిసింది. దీంతో మత్స్యకారులు చేపల వేటకు బయలు దేరారు. సముద్రంలో మత్స్య సంపద వృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం విధించిన రెండు నెలల విరామం జూన్ 14వ తేదీతో ముగిసిన సంగతి తెలిసిందే. దీంతో చేపల వేట సాగించ డానికి మత్స్యకారులు అన్నీ ఏర్పాట్లు చేసుకున్నారు. ఈ ఏడాది ఏప్రిల్ 14వ తేదీ అర్ధరాత్రి నుంచి జూన్ 14వ తేదీ అర్ధరాత్రి వరకు సముద్రంలో చేపలు, రొయ్యలు, ఇతర సంపద వేటపై ప్రభుత్వం నిషేధం విధించిన విషయం విదితమే.

# బెంగళూరు మెట్రోలో అమూల్ స్టాళ్లు

### - అనుమతులపై మండిపడుతున్న కన్నడిగులు - టెండర్ల ద్వారానే అవకాశం: డీసీఎం డీకే

**బెంగళూరు:** నమ్మ మెట్రో రైల్వే స్టేషన్‌లలో గుజరాత్‌కు చెందిన అమూల్ పాల ఉత్పత్తులు విక్రయించేందుకు అనుమతిలివ్వడంపై కన్నడిగులు మండి పడుతున్నారు. గత లోక్‌సభ ఎన్నికల్లో అమూల్ విక్రయాలను ప్రోత్సహించేలా కేంద్ర హెూం మంత్రి అమిత్‌షా ప్రస్తావించడం తీవ్ర వివాదానికి దారి తీసింది. దీనిని కాంగ్రెస్ నేతలు ఎన్నికల్లో ప్రచారాస్త్రంగాను ఉపయోగించుకున్నారు. ప్రస్తుతం రెండు మెట్రో స్టేషన్‌లలో అమూల్ స్టాళ్లు తెరిచేందుకు అవకాశం ఇచ్చారు. ఇదే విషయమై డీసీఎం డీకే శివకుమార్ బుధవారం బెంగళూరులో మీడియాతో మాట్లాడుతూ 10 మెట్రో స్టేషన్‌ల్లో పాల ఉత్పత్తులకు అనుమతులు ఇచ్చామని, 8 చోట్ల నందిని, 2 చోట్ల అమూల్ స్టాళ్లు ఏర్పాటవుతాయన్నారు. గ్లోబల్ టెండర్లలో వారికి అవకాశం దక్కిందన్నారు. స్టాళ్లు మూయించడం సరికాదన్నారు. గ్రేటర్ బెంగళూరు అథారిటీలో



ఎన్ని పాలికెలు ఏర్పాటు చేయాలనేది కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో చర్చించామని, ప్రతిపక్ష నాయకులతో చర్చించాక తుది నిర్ణయం తీసుకుంటామన్నారు. స్వచ్ఛ బెంగళూరు కార్యక్రమానికి హెల్ప్‌లైన్ తెరుస్తామన్నారు.

# జగన్ అప్పుడలా.. ఇప్పుడిలా..




**అమరావతి, (రాజధాని వార్తలు):** వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ పరామర్శల పేరిట జరుపుతున్న పర్యటనల నేప థ్యంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొంటున్నాయి. అందుకు తెనాలి, పొదిలి, తాజాగా సత్తెనపల్లి మండలం రెంటపాళ్ల పర్యటన సందర్భంగా చోటు చేసుకున్న పరిణామాలే అందుకు ఉదాహరణ. అయితే తాజాగా వైఎస్ జగన్ విలేకర్ల సమావేశంలో కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ కూటమి ప్రభుత్వ పాలనలో అరాచకం నడుస్తుందంటూ ఆయన వ్యాఖ్యానించారు. అలాగే ఈ పాలన వల్ల రాష్ట్రంలో అక్రమ అరెస్టులు చోటు చేసుకుంటున్నాయని విమర్శించారు. ఆ క్రమంలోనే చెవిరెడ్డిని అరెస్ట్ చేశారని ఆరోపించారు. అయితే వైఎస్ జగన్ చేసిన ఈ వ్యాఖ్యలపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తాయి. అంతేకాకుండా గత వైసీపీ ప్రభుత్వ హయాంలో చోటు చేసుకున్న సంఘటనలు ఈ సందర్భంగా వారు గుర్తు చేస్తున్నారు. ఇటీవల వైఎస్ జగన్ తన పర్యటనలు పరామర్శ యాత్రలాగా కాకుండా.. భారీగా ఫ్లెక్సీలు, గజమాలలతో అతిపెద్ద ఎత్తున సాగుతోందని చెబుతున్నారు. తెనాలి పరామర్శ యాత్రలో అంతంత మాత్రంగా వ్యవహరించిన వైఎస్ జగన్.. పొదిలి పర్యటనకు వచ్చేసరికి కాస్తా పెరిగిందని.. కానీ సత్తెనపల్లికి వచ్చే సరికి ఈ యాత్ర పరాకాష్ఠకు చేరినట్లు అయిందనే విమర్శలు వెల్లువెత్తాయి. ఏడాది క్రితం కొలువు తీరిన కూటమి ప్రభుత్వం.. వైఎస్ జగన్ పర్యటనలపై ఏనాడు ఆంక్షలు విధించ లేదని వారు గుర్తు చేస్తున్నారు. కానీ పల్నాడులోని సత్తెనపల్లిలో మాత్రం జగన్ పర్యటనపై ఆంక్షలు విధించారని వివరిస్తున్నారు. అది కూడా ఎందుకంటే.. ఆ ప్రాంతం సున్నితమైందని వివరిస్తు న్నారు. అదీకాక.. పొదిలి, రెంటపాళ్లలో వైఎస్ జగన్ పర్యటన సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలపై రాతలతోపాటు సోషల్ మీడియా వేదికగా పలు వార్త కథనాలు ఆ ప్రాంతాల్లో హల్ చల్ చేశాయని ఈ సందర్భంగా గుర్తు చేస్తున్నారు. అయితే గత వైసీపీ ప్రభుత్వ హయాంలో టీడీపీ నేతల లక్ష్యంగా వైఎస్ జగన్ వ్యవహ రించిన తీరును వారు ఎండగడుతున్నారు. పార్టీ సీనియర్ నేతలు అచ్చెన్నాయుడు, దూళిపాళ్ల నరేంద్ర, కొల్లు రవీంద్ర, గల్లా జయదేవ్, పట్టాబి తదితరులను అరెస్ట్ చేశారని వివరించారు. అంతే కాకుండా.. సొంత పార్టీలోని అసమ్మతి నేత, నాటి ఎంపీ రఘు రామకృష్ణం రాజును సైతం అరెస్ట్ చేసి.. నానా ఇబ్బందులకు గురి చేశారని అంటున్నారు. దీంతో ఆయన న్యాయస్థానాన్ని ఆశ్రయించారన్నారు. ఇక టీడీపీ కార్యాలయాలపై సైతం దాడులు చేశారు. అక్కడితో ఆగకుండా టీడీపీ అధినేత, మాజీ సీఎం నారా చంద్రబాబు నాయుడును స్కిల్ డవలప్‌మెంట్ స్కామ్ కేసులో అరెస్ట్ చేసి.. రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించారని.. దీంతో 52 రోజుల తర్వాత ఆయనకు తాత్కాలిక బెయిల్ మంజూరు అయిందని సోదా హరణగా వివరించారు. ఇక నందిగామలో సీఎం చంద్రబాబు పర్యటన సందర్భంగా ఆయనపైకి రాయి విసిరితే..అది ఆయన భద్రతా సిబ్బందికి తగిలి.. గాయపడ్డారన్నారు. అదీకాక.. 2019 ఎన్నికలకు ముందు వైఎస్ జగన్ సొంత చిన్నాన్నా వైఎస్ వివేకా నందరెడ్డి దారుణ హత్యకు గురయ్యారు. ఈ నేపథ్యంలో ఈ హత్యకు కర్మ కర్త క్రియ అంతా నాటి సీఎం చంద్రబాబు అంటూ.. నారా వారి రక్త చరిత్ర పేరటి కథనాలను సైతం వండి వార్చింది వైసీపీ కాదా? అనే ప్రశ్న సైతం వారు వేస్తున్నారు. అలాగే వైసీపీ ప్రభుత్వ హయాంలో వైఎస్ వివేకా హత్య కేసు అంశంలో ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ ఎటువంటి చర్యలు తీసుకున్నారంటే.. ఆ విషయం అందరికి తెలిసిందేనంటున్నారు. తమ ప్రభుత్వం హయంలో జరిగిన సంఘటనలు పక్కన పెట్టి.. తాజాగా కూటమి ప్రభుత్వంపై వైఎస్ జగన్ చేస్తున్న ఆరోపణలు చూస్తే.. దెయ్యాలు వేదాలు వల్లిస్తున్నట్లుగా ఉందనే అభిప్రాయం సర్వత్ర వ్యక్తమవుతోంది.

# మా ప్రభుత్వంలో ఎవరిపైనా కక్ష సాధింపులు ఉండవు : మంత్రి నారా లోకేష్



**ఢిల్లీ:** జగన్ పాలనలో తప్పు చేసిన వారంతా శిక్ష అనుభవిస్తారని ఏపీ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ తెలిపారు. తప్పు చేసిన వారిని ఎవరిని విడిచిపెట్టే ప్రసక్తే లేదని అన్నారు. మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై ఉన్న కేసుల విచారణ కొనసాగుతోందని తెలిపారు. ప్రజలు అధికారం తమకు ఇచ్చింది జగన్, ప్రతిపక్ష నేతలపైన కక్ష సాధింపు చర్యలకు పాల్పడ టానికి కాదని స్పష్టం చేశారు. చట్టప్రకారం అందరికీ శిక్షపడేలా చేస్తామని హెచ్చరించారు. తమ ప్రభుత్వంలో ఎవరిపైనా కక్ష సాధింపులు ఉండవని స్పష్టం చేశారు. ఇవాళ (గురువారం) ఢిల్లీలో మీడియాతో నారా లోకేష్ చిట్‌చాట్ చేశారు. రాష్ట్రంలో సుపరిపాలన కోసం ప్రజలు తమకు అధికారం ఇచ్చారని.. వ్యక్తిగత కక్షసాధింపుల కోసం కాదని మంత్రి నారా లోకేష్ అన్నారు. తప్పు చేసిన వారి పేర్లన్నీ రెడ్‌బుక్‌లో ఉన్నాయని చెప్పారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కుటుంబసభ్యులతో కలవడం మరిచిపోలేనిదని చెప్పారు. క్రమశిక్షణతో ఉండాలని, ప్రకృతిని ప్రేమించాలని దేవాన్ష్‌కి ప్రధాని మోదీ చెప్పారని గుర్తు చేశారు. రెండు రోజులపాటు పలువురు కేంద్రమంత్రులను ఢిల్లీలో కలిశానని వివరించారు. ఆంధ్రప్రదేశ్‌కి మంచి చేయాలన్న తపన వాళ్లందరిలో కనిపించిందని చెప్పారు మంత్రి నారా లోకేష్.

**ప్రధాని మోదీ సలహాలు, సూచనలు పాటిస్తాం..**

రాజకీయాల్లో ఎలా ఎదగాలి, కార్యకర్తలతో ఎలా మెలగాలన్న విషయాలు మోదీ చాలా చక్కగా వివరించారని మంత్రి నారా లోకేష్ తెలిపారు. ప్రధాని మోదీ సలహాలు, సూచనలను ఎప్పుడూ పాటి స్తానని చెప్పారు. ప్రధానితో దాదాపు రెండు గంటలకుపైగా జరిగిన సమావేశం తన జీవితంలో మర్చిపోలేనిదని అన్నారు. ప్రధానితో జరిగిన సమావేశం తనకు మంచి ప్రేరణ కలిగించిందని తెలిపారు. ప్రతి మనిషి జీవితంలో కొన్ని పొరపాట్లు జరుగుతూ ఉంటాయని.. మనం మంచి హృదయంతో పని చేస్తే ప్రజలు వాటిని అర్థం చేసుకుంటారని ప్రధాని తనకు చెప్పారని గుర్తుచేశారు. మనం చేసే పనిలో ఉద్దేశం మంచిదైతే ప్రజలు గుర్తుంచుకుంటారని అన్నారు. సంక్షేమ పథకాలు అమలు చేయడం ముఖ్యం కాదని.. ప్రజల హృదయాలకు దగ్గరయ్యే విధంగా వాటిని అమలు చేయడమే ముఖ్యమని మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు.

**ఎమ్మెల్యేల పనితీరుపై నివేదిక...**

ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని కేంద్రమంత్రులు తమకు హామీ ఇచ్చారని మంత్రి నారా లోకేష్ గుర్తుచేశారు. ఏపీలో విద్యారంగంలో చేపట్టబోయే సంస్కరణల గురించి కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ చాలా ఆసక్తి చూపించారని అన్నారు. ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ అధికారులతో కలిసి మరోసారి కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. నైపుణ్యంతో కూడిన విద్యను ఆంధ్రప్రదేశ్‌లో అందించేందుకు బ్రిటన్ మాజీ ప్రధాని టోనీ బ్లెయిర్‌కి సంబంధించిన సంస్థతో చర్చలు జరిపామని వెల్లడించారు. తమ ప్రభుత్వంలో ఎమ్మెల్యేల పనితీరుపైన నివేదిక తయారు చేస్తున్నామని చెప్పారు. ఒక్కొక్క ఎమ్మెల్యేని పిలిచి వాళ్ల పనితీరుకు సంబంధించిన నివేదికను వాళ్లకు అందజేస్తామని అన్నారు. కొంతమంది ఎమ్మెల్యేలు తమ పనితీరును మార్చుకోవాల్సిన అవసరం ఉందని.. దానికోసం వారికి మూడు నెలల సమయం ఇస్తామని మంత్రి నారా లోకేష్ వెల్లడించారు.

# వైభవంగా శ్రీ ముత్యమాంబ అమ్మవారు జాతర

## - పాల్గొన్న వైఎస్ఆర్సిపి జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు, బుల్లి తెర తారలు





**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** ఉత్తర నియోజకవర్గం, అక్కయ్య పాలెంలో శ్రీ గౌరి సేవా సంఘం ఆధ్వర్యంలో శ్రీశ్రీశ్రీ ముత్యమాంబ అమ్మవారు పండుగ ఘనంగా జరిగింది. సాయంత్రం జరిగిన పరస వేడుకల్లో వైఎస్ఆర్సిపి జిల్లా అధ్యక్షుడు కేకే రాజు పొల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం మళ్ళ శివ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలలో కోలీవుడ్ తార షకీలా, ప్రముఖ సినీ హాస్య నటుడు సుమన్ శెట్టి, జబర్దస్త్ అప్పారావు పాల్గొనీ మాట్లాడారు. అమ్మవారి ఆశీస్సులు విశాఖ ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు.

ప్రతి ఏటా ఇక్కడ అమ్మవారి ఉత్సవం వైభవంగా జరుగుతుంటుందని, ఈ ఏడాది కూడా జాతర అంబరాన్ని అంటుతుందన్నారు. ఈ కార్యక్రమంలో దుప్పలపూడి శ్రీనివాసరావు, పారుపల్లి రవి, జక్కంపూడి సత్యనారాయణ, పద్మశేఖర్, గాలి ప్రసాద్, జగదీశ్, స్వర్ణ, గణేష్ ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ మెలోడి థియేటర్‌లో భారత్‌లోనే మొట్టమొదటి బార్కో హెచ్ డి ఆర్ ప్రొజెక్టర్ ప్రారంభం





**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** శ్రీ మెలోడి థియేటర్ (విశాఖపట్నం)లో కొత్త సినిమా టెక్నాలజీ అయిన హెచ్ డి ఆర్ (హై డైనమిక్ రేంజ్) ని బెల్జియంను కేంద్రంగా ఉన్న ప్రొజెక్టర్ కంపెనీ బార్కో పరిచయం చేసింది. ఇది ఆసియాలో తొలి, ప్రపంచంలో ఏడవ ప్రొజెక్టర్. ఈ ప్రొజెక్టర్‌ను భారత్‌లో అందుబాటులోకి తీసుకొచ్చిన సంస్థ టిడిఐ (ది డిజిటల్ ఇన్‌ఫ్రా)తో బార్కో భాగస్వామ్యం చేసుకుంది.

ఏల్ఎస్4కె హెచ్ డి ఆర్ ప్రొజెక్టర్ ను మే నెలలో పునఃనిర్మాణం అనంతరం తిరిగి ప్రారంభమైన శ్రీ మెలోడి థియేటర్‌లో మొదటిసారిగా అమర్చారు. తగిన విధంగా ఓపెనింగ్ ఈవెంట్ జరగకపోయినప్పటికీ, థియేటర్ యజమాని డా.అట్లూరి, బార్కో & టిడిఐ సంస్థలతో కలిసి ఈ కొత్త టెక్నా లజీని ప్రజలకు పరిచయం చేశారు. చెన్నైలోని ప్రసాద్ ల్యాబ్స్‌తో కలిసి బార్కో హెచ్ డి ఆర్ గ్రేడింగ్ ల్యాబ్ ఏర్పాటుచేసింది. ఇప్పటికే హెచ్ డి ఆర్‌లో గ్రేడ్ చేసిన సినిమాలు ఉన్నాయి. విడముయర్చి అనే తమిళ్ సినిమా మొదటి హెచ్ డి ఆర్ గ్రేడ్ చేసిన భారతీయ సినిమా కాగా, కింగ్‌డమ్, కుబేరా, కూలీ మొదటి తెలుగు హెచ్ డి ఆర్ సినిమాలుగా విడుదల కానున్నాయి. హెచ్ డి ఆర్ టెక్నాలజీకి సంబంధించి బార్కో ప్రత్యేకంగా ఒక ప్రారంభ కార్యక్రమం నిర్వహించనుంది.డా. అట్లూరి కుటుంబం ఈ టెక్నాలజీని అధికారికంగా ప్రారంభించి ప్రేక్షకుల కోసం అందుబాటులోకి తెచ్చారు. ప్రపంచంలోనే అత్యాధునిక టెక్నాలజీని సొంతం చేసుకున్న విశాఖపట్నం గర్వించదగ్గ విషయమని ఆయన తెలిపారు.

# యోగాతో సంపూర్ణ ఆరోగ్యం : బిజెపి రాష్ట్ర కార్యదర్శి రెడ్డి పావని



**విజయనగరం, (రాజధాని వార్తలు):** యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సొం తమవుతుందని బిజెపి రాష్ట్ర కార్యదర్శి రెడ్డి పావని అన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా బుధవారం స్థానిక బాలికల ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో యోగా కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిత్యము యోగ సాధనతో శారీరక, మానసిక ఆరోగ్యం లభిస్తుందని అన్నారు. జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని నెల రోజులుగా రాష్ట్ర ప్రభుత్వం యోగాంధ్ర కార్యక్రమాన్ని ఎంతో ప్రతిష్టాత్మంగా చేపడుతుందన్నారు. అనంతరం విద్యార్థులతో పలు యోగ ఆసనాలు, సూర్య నమస్కారాలు, యోగ కసరత్తులు సామూహికంగా ప్రాక్టీస్ చేయించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సి.హెచ్.రమేష్ కుమార్, మండల అధ్యక్షులు మేటికోటి భాస్కరరావు, ఏడుకొండలు, డి.దేవుడు బాబు, తవుడు, ఈశ్వరరావు, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి ఆనంకు ప్రత్యేక ధన్యవాదములు

## - సాగునీటి సంఘం అధ్యక్షులు షేక్ బాబు







**సంగం, (రాజధాని వార్తలు):** దేవాదాయ, ధర్మాదాయ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి చొరవతో తలుపురుపాడు చెరువు కట్ట అభివృద్ధి జరిగిందని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డికి, సాగునీటి సంఘం అధ్యక్షులు షేక్ బాబు, గ్రామస్తులు ఆయనకు ప్రత్యేక ధన్యవాదములు, కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా షేక్ బాబు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా కట్టపై నడవలేక ఇబ్బందులు పడుతున్న రైతులకు ఆనం దయవల్ల చెరువు కట్ట బాగు పడిందని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారం లోకి రాగానే రైతులతో కలిసి మంత్రి ఆనం దృష్టికి సంగం సాగునీటి సంఘం అధ్యక్షులు షేక్ బాబు తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన మంత్రి ఆనం చెరువు కట్ట అభివృద్ధికి ఆదేశాలు జారీ చేశారని ఆయన తెలిపారు. మంత్రి ఆనం చొరవతో ముమ్మరంగా చెరువు కట్ట అభివృద్ధి పనులు జరుగుతున్నట్లు తెలిపారు. చెరువు కట్ట పనులు దాదాపు పూర్తవుతున్నట్లు ఆయన తెలిపారు.నిరంతరం పనులను సంగం సాగునీటి సంఘం అధ్యక్షులు, టీడీపీ నాయకులు షేక్ బాబు పర్యవేక్షిస్తున్నారు. గ్రామస్తులు, రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.


# జిల్లా సహకార కేంద్ర బ్యాంకు బలోపేతానికి చర్యలు

## - డీసీసీబీ చైర్మన్ కిమిడి నాగార్జున



**విజయనగరం, (రాజధాని వార్తలు):** జిల్లా కేంద్ర సహకార బ్యాంకు బలోపేతానికి పరస్పర సహకారంతో పని చేద్దామని డీసీసీబీ చైర్మన్ కిమిడి నాగార్జున అన్నారు. బ్యాంకు మీద ప్రజల్లో విశ్వాసం పెంచాలని సూచించారు. జిల్లాలోని బ్రాంచి మేనేజర్లు, సిబ్బందితో ఆయన స్థానిక కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ..మార్చి 25 నాటికి బ్యాంకులో ఉన్న 316 కోట్ల డిపాజిట్లను 400 కోట్లకు పెంచుటకు మరియు 2150 కోట్లుగా ఉన్న బ్యాంకు వ్యాపార పరిమాణాన్ని 2500 కోట్లకు పెంపుదల చేయుటకు టార్గెట్‌గా నిర్ణయించడమైనది. కొన్ని పీఏసీఎస్‌ల్లో సమస్యలు ఉన్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. త్వరలోనే అన్నింటినీ తాను పరిశీలిస్తానని చెప్పారు. భవనాలు, సౌకర్యాలు, సిబ్బంది సమస్యలను గుర్తించి.. పై స్థాయిలో వాటి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఎక్కడా అవినీతికి తావు లేకుండా పని చేయాలని.. రైతులకు, ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించాలని కోరారు.

# అంకితభావం అన్నపూర్ణమ్మ సొంతం : డిప్యూటీ డి.ఇ.ఓ మోహన్ రావు



**గజపతినగరం, (రాజధాని వార్తలు):** తెలుగు ఉపాధ్యాయురాలుగా 42 సంవత్సరాలు అంకితభావంతో అన్నపూర్ణమ్మ పనిచేశారని బొబ్బిలి ఉప విద్యాశాఖ అధికారి కే .మోహన్ రావు అన్నారు. గత నెల మే 31న పదవి విరమణ చేసిన అన్నపూర్ణమ్మ టీచర్ను ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది బుధవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉపాధ్యాయ వృత్తిని దైవంగా భావించి అన్నపూర్ణమ్మ సుదీర్ఘకాలం పనిచేసి, అందరి మన్ననలు పొందరన్నారు. ఎంఈఓ ఎస్.విమలమ్మ మాట్లాడుతూ, ఎంతోమంది ఉత్తమ విద్యార్థులను తయారుచేసిన అన్నపూర్ణమ్మ అంకితభావం అందరికీ ఆదర్శప్రాయమన్నారు. అనంతరం జరిగిన సన్మాన కార్యక్రమంలో ఉపాధ్యాయులు దుస్సాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మీసాల వెంకటేశ్వరరావు, సి.హెచ్. రమేష్ కుమార్, బొండపల్లి ఎంఈఓ శోభారాణి, విజయనగరం ఎంఈఓ సత్యవతి, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# అన్నపై తమ్ముడు నాటు తుపాకీతో కాల్పులు

## - తురువోలు హత్య కేసులో నాటు తుపాకీకి ఆహుతైన జోగా రాము

## - ముద్దాయిని పట్టుకున్న సర్కిల్ ఇన్స్పెక్టర్ పి.పైడుపు నాయుడు



**చోడవరం, (రాజధాని వార్తలు):** అనకాపల్లి జిల్లా చీడికాడ మండలం, తురువోలు గ్రామంలో ఓ గ్రామ దేవత పండగ సందర్భంలో తాగిన మైకంలో తురువోలు గ్రామానికి చెందిన జోగా రాము, దేవుళ్ళు అన్నదమ్ములు పొలంలో పాక వద్ద మేకలు, ఆవులు, విషయంలో గొడవపడి ఇద్దరు ఘర్షణ పడ్డారు. దేవుళ్ళు ఆవుపాలు ఆవు పెయ్య తాగేసిందని ఇద్దరి మధ్య గొడవ ముదిరింది. ఒకరిపై ఒకరు అంతు చూస్తానని వాదించుకున్నారు. ఇంతలో పాకలో ఉన్న నాటు తుపాకీ తూటులాలు ప్రక్క భాగంలో దూసుకుపోవడంతో కుప్పకూలిపోయాడు. కొన ఊపిరితో ఉన్న రామును స్థానికులు పొలంలో కల్లాల వద్ద నుంచి ఊరిలోకి తీసుకు వచ్చి ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. సమాచారం అందుకున్న కె.కోటపాడు సిఐ పైడుపునాయుడు, ఎస్సై నారాయణరావు ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం జోగా రాము మృతదేహాన్ని అనకాపల్లి ఎన్టీఆర్‌కి తరలించారు. పంచనామా కార్యక్రమం అనంతరం పరారీలో ఉన్న జోగా దేవుళ్ళు ఆటో స్టాండ్‌లో పట్టుపడ్డాడు. సీఐ పైడుపునాయుడు మూడు సెక్షన్ వైస్గ 103 (1) బి ఎం ఎస్, 25(1) ఏ, 27 ఏ (3) గా నమోదు చేశారు. నియోజవర్గంలో లైసెన్స్ లేని నాటు తుపాకులు వారం రోజుల్లో స్టేషన్‌కి అప్పగిస్తే కేసు లేకుండా కౌన్సిలింగ్ ఇచ్చి పంపిస్తామని లేనియెడల మా ఎంక్వయిరీలో లైసెన్స్ లేని నాటు తుపాకులు వాడితే కేసులు పెట్టి జైలుకు పంపిస్తాం అంటూ హెచ్చరికలు జారీ చేశారు.

# రాష్ట్రంలో మరిన్ని ఎంజేపీ స్కూళ్ల ఏర్పాటు : రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత

## - వచ్చే ఏడాది జూనియర్ కళాశాలగా జమ్మాదేవి పేట 'ఎంజేపీ' అప్ గ్రేడ్





**ఎల్.కోట/విజయనగరం, (రాజధాని వార్తలు):** రాష్ట్రంలో బీసీ గురుకుల పాఠశాలలకున్న డిమాండ్ రీత్యా మరిన్ని ఎంజేపీ స్కూళ్లు ఏర్పాటు చేయనున్నట్లు రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్ సవిత తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరం నాటికి జమ్మాదేవి పేట ఎంజేపీ బీసీ బాలికల గురుకుల పాఠశాలను అప్‌గ్రేడ్ చేయనున్నట్లు వెల్లడించారు. విజయనగరం జిల్లా ఎల్ కోట మండలంలో ఉన్న జమ్మాదేవి పేట గ్రామంలో ఉన్న ఎంజేపీ బాలికల గురుకుల పాఠశాలను ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారితో కలిసి పరిశీలించారు. గురుకుల పాఠశాలలోని తరగతి గదులు, విశ్రాంతి గదులు, ల్యాబ్, లైబ్రరీ, మరుగుదొడ్లను పరిశీలించారు. పదో తరగతి విద్యార్థినులతో మంత్రి సవిత ముచ్చటించారు. విద్యా మిత్ర కిట్లు అందరికీ అందాయా...సన్న బియ్యంతో భోజనం పెడుతున్నారా..? అని అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలో విద్యా వ్యవస్థ అభివృద్ధికి సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ తీసుకుంటున్న చర్యలు గురించి వివరించారు. పదో తరగతి ఫలితాల్లో వుంది శాతం ఫలితాలు సాధించడంపై ఉపాధ్యాయ సిబ్బందిని మంత్రి అభినందించారు. గురుకులం నిర్వహణపై మంత్రి సవిత సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ, వచ్చే విద్యా సంవత్సరం నాటికి జమ్మాదేవి పేట ఎంజేపీ పాఠశాలను జూనియర్ కళాశా లగా అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో ఎంజేపీ స్కూళ్లకు ఉన్న డిమాండ్ దృష్ట్యా మరిన్ని గురుకులాల ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి సవిత ప్రకటించారు. పేద బీసీ విద్యార్థులకు ఆహార భద్రతతో కూడిన నాణ్యమైన విద్య అందించడమే సీఎం చంద్రబాబు నాయుడు లక్ష్యమని మంత్రి సవిత స్పష్టం చేశారు. అనంతరం పలువురు విద్యార్థినులకు సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యా మిత్ర కిట్లు పంపిణీ చేశారు. ఎంజేపీ స్కూల్ ఆవరణలో మంత్రి సవిత మొక్క నాటారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారితో పాటు పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

# ఏపీలో కుబేర టికెట్ రేట్ల పెంపు.. ఇప్పుడు ధర ఎంతంటే?



టాలీవుడ్ కింగ్ నాగార్జున, కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్, నేషనల్ క్రష్ రష్మిక మందన్న లీడ్ రోల్స్‌లో నటిస్తున్న మూవీ కుబేర. టాలెంటెడ్ డైరెక్టర్ శేఖర్ కమ్ముల దర్శకత్వం వహించిన ఆ సినిమాను శ్రీ వెంకటేశ్వర సినిమాస్ ఎల్ ఎల్ పీ, అమిగోస్ క్రియేషన్స్ బ్యానర్లపై సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్ రావు గ్రాండ్‌గా భారీ బడ్జెట్ తో నిర్మించారు. రాక్ స్టార్ దేవిశ్రీ ప్రసాద్ మ్యూజిక్ అండ్ బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందించగా.. పాన్ ఇండియా రేంజ్‌లో కుబేర సినిమాను జూన్ 20వ తేదీన విడుదల కానుంది. తెలుగు, తమిళం, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో రిలీజ్ అవ్వనుంది. అయితే ఆడియన్స్‌లో సినిమాపై ముందు నుంచే బజ్ నెలకొనగా.. ప్రమోషన్స్‌తో ఓ రేంజ్‌లో నెలకొల్పారు మేకర్స్. అయితే సెన్సార్ బోర్డు.. కుబేరకు యూ/ఏ సర్టిఫికెట్ ఇచ్చిన విషయం తెలిసిందే. బోర్డు సూచనల మేరకు మార్పులు చేర్పులు చేసిన తర్వాత 182 నిమిషాల 38 సెకన్ల రన్ టైమ్ తో కుబేరను థియేటర్స్ లో విడుదల చేస్తున్నారు మేకర్స్. మూడు గంటలకు పైగా సినిమా ఉండనుంది. తెలుగులో ఒక నిమిషం తక్కువ రన్ టైమ్‌తో రిలీజ్ కానుంది. కాగా, విడుదలకు మేకర్స్ అన్ని ఏర్పాట్లను మేకర్స్ పూర్తి చేయగా.. ఇప్పుడు టికెట్ ధరల పెంపునకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది. మల్టీప్లెక్స్, సింగిల్ స్క్రీన్ థియేటర్స్ లో రేట్ల పెంపునకు ఉత్తర్వులు జారీ చేసింది. రూ.75 (జీఎస్టీ అదనం) వరకు కూడా ధరలు పెంచుకునే వెసులుబాటు ఇప్పుడు ఏపీ ప్రభుత్వం కల్పించింది. దీంతో సింగిల్ స్క్రీన్ లో టికెట్ ధర రూ.236 వరకు.. మల్టీప్లెక్స్‌లో ధర రూ. 265.50 వరకు టికెట్లు రేట్లు పెరిగే అవకాశం ఉంది. అయితే సినిమా రిలీజ్ అయిన తేదీ నుంచి 10 రోజుల పాటు టికెట్ ధరలు అమల్లో ఉండేలా అనుమతులు ఇచ్చింది ఏపీ సర్కార్. అయితే తెలంగాణలో టికెట్ ధరల విషయంలో మార్పు లేదని తెలుస్తోంది. ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో కుబేర ప్రీ బుకింగ్స్ బాగానే జరుగుతున్నాయని సమాచారం. శేఖర్ కమ్ముల, నాగార్జున ఫ్యాక్టర్స్ వర్కౌట్ అయినట్టు క్లియర్ గా కనిపిస్తుంది. సోషల్ డ్రామా రానున్న సినిమా కంటెంట్ పై అంతా హోప్స్ పెట్టుకున్నారు. కచ్చితంగా హిట్ అవుతుందని ఫిక్స్ అయిపోయారు. మరి కొన్ని గంటల్లో తేలిపోనుంది.. కుబేర ఎలా ఉంటుందో.. ఎలాంటి హిట్ అవుతుందనేది.

# తన సినిమా రిలీజ్.. రూల్స్ పెట్టిన ఆమిర్



'బాలీవుడ్ సూపర్ స్టార్ ఆమిర్ ఖాన్ కెరీర్లో చాలా కీలకమైన సినిమా.. సితారే జమీన్ పర్. ఒకప్పుడు వరుసగా ఇండస్ట్రీ హిట్లు ఇచ్చిన ఆమిర్.. తన చివరి రెండు చిత్రాలతో గట్టి ఎదురు దెబ్బలు తిన్నాడు. థగ్స్ ఆఫ్ హిందుస్థాన్, లాల్ సింగ్ చడ్డా దారుణమైన ఫలితాన్ని అందుకున్నాయి. ముఖ్యంగా 'లాల్ సింగ్ చడ్డా' చుట్టూ రిలీజ్‌కు ముందే విపరీతమైన నెగెటివిటీ చుట్టుకుని మినిమం ఓపెనింగ్స్ కూడా లేకుండా బాక్సాఫీస్ దగ్గర చతికిలపడింది. ఇప్పుడు 'సితారే జమీన్ పర్' చుట్టూ కూడా కొంత నెగెటివిటీ కనిపిస్తోంది. ఓ ఫారిన్ మూవీకి అఫీషియల్ రీమేక్‌గా తెరకెక్కిన ఈ సినిమా గురించి సోషల్ మీడియాలో నెగెటివ్ క్యాంపైన్ నడిచింది. అయినా ఆమిర్ సినిమా సక్సెస్‌పై చాలా ధీమాగా ఉన్నాడు. శుక్రవారమే సినిమా రిలీజ్ కానుండగా.. తన సినిమా ప్రదర్శన విషయంలో ఆమిర్ థియేటర్ల యాజమాన్యాలకు కొన్ని రూల్స్ పెట్టడం విశేషం. పెద్ద హీరోల సినిమాలు రిలీజైనపుడు అర్లీ మార్నింగ్ షోలు వేయడం కామన్. కానీ తన సినిమాకు మాత్రం అవి వద్దని అంటున్నాడు ఆమిర్. ఈ చిత్రానికి నిర్మాత కూడా ఆమిరే అన్న సంగతి తెలిసిందే. తన సినిమాను ఉదయం 9 లోపు ఎక్కడా ప్రదర్శించకూడదని ఆయన స్పష్టం చేశారు. అలాగే తెల్లవారుజామున 4 గంటల షోలు కూడా వద్దని తేల్చేశారు. దేశవ్యాప్తంగా ఉన్న అన్ని థియేటర్లకు ఈ మేరకు సమాచారం పంపారట. అలాగే టికెట్ల ధరలు కూడా అందుబాటులో ఉండాలని.. వీకెండ్లో మాత్రమే రేట్లు పెంచుకోవాలని, అవి కూడా పరిమితికి మించకూడదని స్పష్టం చేశారట. ఇక సింగిల్ స్క్రీన్లలో ఒకట్రెండు షోలు 'సితారే జమీన్ పర్' వేసి మిగతా షోలు వేరే సినిమాకు ఇవ్వడంలాంటివి కుదరదని.. రోజు మొత్తం ఈ సినిమానే ప్రదర్శించేట్లయితేనే తీసుకోవాలని, లేదంటే వద్దని ఆయన స్పష్టం చేశారు. మరోవైపు ఈ సినిమాకు రూ.120 కోట్ల మేర డిజిటల్ స్ట్రీమింగ్ ఆఫర్ వచ్చినా ఆమిర్ తిరస్కరించినట్లు వార్తలు వస్తున్నాయి. ఓటీటీ డీల్‌కు మొత్తంగా నో చెప్పిన ఆమిర్.. సినిమా రిలీజైన ఎనిమిది వారాల తర్వాత తన యూట్యూబ్ ఛానెల్లో పే పర్ వ్యూ పద్ధతిలో డిజిటల్‌గా రిలీజ్ చేయబోతుండడం విశేషం.

# 'ఒకసారి నమ్మకం పోతే అంతే'.. డైరెక్టర్ రాజ్ భార్య పోస్ట్



బాలీవుడ్ దర్శకుడు రాజ్ నిడిమోరు, హీరోయిన్ సమంత గురించి సోషల్ మీడియాలో జోరుగా వార్తలు చక్కర్లు కొడుతున్న విషయం తెలిసిందే. ఇటీవల తరచూ ఇద్దరూ కలిసి కనిపించడంతో రిలేషన్‌లో ఉన్నారని టాక్ వినిపిస్తోంది. దానిపై ఇప్పటి వరకు సామ్ గానీ.. రాజ్ గానీ ఎక్కడా రెస్పాండ్ అవ్వలేదు. కేవలం ఆమె మేనేజర్ స్పందించారు. అదే సమయంలో ఊహాగానాల మధ్య.. రాజ్ నిడిమోరు సతీమణి శ్యామాలి పెట్టిన పోస్టులు కొన్ని రోజులుగా అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. సోషల్ మీడియాలో వైరల్ గా మారుతున్నాయి. కాలం అన్నింటినీ బయటపెడుతుంది.. కర్మ సమాధానం చెబుతుందని ఇటీవల పోస్ట్ పెట్టిన ఆమె.. ఇప్పుడు నమ్మకాన్ని ఉద్దేశించి నెట్టింట పోస్ట్ చేశారు. నమ్మకం అనేది అన్నిటికన్నా విలువైనదని చెప్పిన శ్యామాలి.. ఒకసారి దాన్ని కోల్పోతే ఎన్ని ఆస్తులు పెట్టినా తిరిగి పొందలేరని ఇన్ స్టా స్టోరీలో రాసుకొచ్చారు. రాజ్, సామ్ త్వరలో రిలేషన్‌ను అనౌన్స్ కూడా చేయనున్నారని ప్రచారం జరుగుతున్న వేళ.. నమ్మకం గురించి ఆమె మాట్లాడడం ఇప్పుడు ఇండస్ట్రీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. అయితే ఎప్పటికప్పుడు శ్యామాలి ఇన్ స్టాలో పోస్టులు పెడుతుంటారు. కానీ రాజ్, సమంత రిలేషన్ పై వార్తలు వస్తున్నప్పుడు నుంచి ఆమె ఏం పెట్టినా వైరల్ గా మారుతున్నాయి. కాగా.. శ్యామాలి బాలీవుడ్ దర్శకులు రాకేశ్ ఓం ప్రకాశ్ మిశ్రా, విశాల్ భరద్వాజ్ వద్ద అసిస్టెంట్ దర్శకురాలిగా పనిచేశారు. క్రియేటివ్ కన్సల్టెంట్‌గా కూడా వర్క్ చేశారు. ఆ తర్వాత రాజ్, శ్యామాలి 2015లో పెళ్లి చేసుకున్నారు. వారికి ఒక పాప ఉందని సమాచారం. వివాహం తర్వాత రాజ్ నిడిమోరు రూపొందించిన సినిమాలకు క్యాస్టింగ్‌లో ఆమె సహాయం చేస్తుండేవారు. అయితే శ్యామాలి చివరి సారిగా 2023లో ప్రేమికుల దినోత్సవం సందర్భంగా రాజ్ నిడిమోరుతో కలిసి దిగిన పిక్‌ను పోస్ట్ చేశారు. ఇద్దరూ విడిపోతున్నారంటూ కొన్ని రోజుల క్రితం వార్తలు వచ్చినా.. రాజ్ – శ్యామాలి ఎక్కడా స్పందించలేదు. కాగా, ది ఫ్యామిలీ మ్యాన్ సీజన్ 2, సిటాడెల్: హనీ బన్నీ వెబ్ సిరీసుల కోసం రాజ్, సామ్ కలిసి వర్క్ చేశారు. సమంత ఇటీవల నిర్మించిన శుభం చిత్రానికి రాజ్ క్రియేటివ్ ప్రొడ్యూసర్ గా పనిచేశారు. సామ్ అప్ కమింగ్ వెబ్ సిరీస్ రక్త బ్రహ్మాండ్: ది బ్లడీ కింగ్‌డమ్‌ను రాజ్ నిర్మిస్తున్నారు.

# రౌడీ స్టార్, నవీన్ పొలిశెట్టి సేమ్ టు సేమ్!



రౌడీ స్టార్ విజయ్ దేవరకొండ 'అర్జున్‌రెడ్డి' తరువాత ఏ స్థాయి క్రేజ్‌ని సొంతం చేసుకున్నాడో తెలిసిందే. యూత్‌లో రికార్డు స్థాయి పాపులారిటీని సొంతం చేసుకున్న విజయ్ దేవరకొండ డియర్ కామ్రేడ్ వరకు అదే ఊపుని కొనసాగించాడు. అయితే పూరీని అతిగా నమ్మి చేసిన 'లైగర్' ఆ క్రేజ్‌ని చాలా వరకు జీరో చేసేసింది. ఈ సినిమాతో భారీ డిజాస్టర్ ఎదుర్కోవడంతో విజయ్ దేవరకొండ చాలా వరకు సైలెంట్ అయిపోయాడు. అప్పటి వరకు తన ప్రతి మూవీ ఈవెంట్‌లో 'వాట్సాప్ వాట్సాప్ రౌడీ బాయ్స్' అంటూ ఫ్యాన్స్‌ని హోరెత్తించిన విజయ్‌లో 'లైగర్' డిజాస్టర్ తరువాత చాలా వరకు ఆ జోష్, సినిమాల విషయంలో స్పీడు మిస్సవుతూ వస్తోంది. కుషీ, ఫ్యామిలీ స్టార్ సినిమాలతో ప్రేక్షకుల ముందుకొచ్చినా కానీ రౌడీ మార్కు స్పార్క్ ఎక్కడా కనిపించలేదు. దీనికి తోడు విజయ్ దేవరకొండ నటించిన పాన్ ఇండియా మూవీ 'కింగ్‌డమ్' రిలీజ్ రోజు రోజుకీ ఆలస్యం అవుతుండటంతో ఫ్యాన్స్ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత కొంత కాలంగా తన మార్కు బ్లాక్ బస్టర్‌ని సొంత చేసుకోలేకపోతున్న విజయ్ దేవరకొండ 'కింగ్‌డమ్'తో బ్లాక్ బస్టర్‌ని సొంతం చేసుకోవాలని అభిమానులు కోరుకుంటున్నారు. ఇదే తరహాలో సందడి చేసిన సైలెంట్ అయిన మరో యంగ్ హీరో నవీన్ పొలిశెట్టి. 'జాతిరత్నాలు' సినిమాతో రికార్డు స్థాయి విజయాన్ని సొంత చేసుకోవడమే కాకుండా టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా నిలిచిన నవీన్ 'మిస్‌శెట్టి మిస్టర్ పొలిశెట్టి' తరువాత బాగా సైలెంట్ అయిపోయాడు. తన నుంచి సినిమా వచ్చి రెండేళ్లకు పైనే అవుతోంది. ప్రస్తుతం 'అనగనగ ఒక రాజు'లో నటిస్తున్నా అది ఇప్పట్లో వచ్చేలా లేదు. వచ్చే ఏడాది ఇది ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. అంటే దాదాపు మూడేళ్లుగా ఈ హీరో ప్రేక్షకులకు దూరమయ్యాడన్నమాట. ఉన్నపనట్టుండి నవీన్ ఇంత సైలెంట్ కావడానికి కారణం ఏంటనే ఫ్యాన్స్ ఫీలవుతున్నారట. నవీన్ చేయి ఫ్రాక్చర్ కావడంతో సినిమా షూటింగ్ మరింతగా ఆలస్యం అయింది. దీంతో ఈ ఏడాది కూడా అతని సినిమా థియేటర్లకు రావడం లేదు. ఇలా విజయ్ దేవరకొండ, నవీన్ పొలిశెట్టి ఒకే తరహాలో సైలెంట్ కావడంతో అభిమానులు కొంత నిరాశకు గురవుతున్నారు.

# రాష్ట్రాన్ని రావణకాష్ట చెయ్యాలని జగన్ రెడ్డి కుట్ర : బుద్ధ నాగ జగదీష్



**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** 2024 ఎన్నికల్లో వైసీపీకి 11 సీట్లు పరిమితం చేసినందుకు ఓటర్లపై కక్ష తీర్చుకోవడానికి జగన్ రెడ్డి యాత్రలు సాగుతున్నాయని, శత్రు మూకలు పై దండయాత్రి చేసినట్లు, వందల వాహనాలతో మంది మార్బలంతో భయాందోళన సృష్టిస్తూ, జగన్ రెడ్డి శవయాత్రలు సాగుతున్నాయని తెలుగుదేశం పార్టీ మాజీ శాసనమండలి సభ్యులు రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బుద్ధ నాగ జగదీశ్వరరావు పార్లమెంట్ కార్యాలయంలో ఈరోజు ఉదయం జరిగిన విలేకరుల సమావేశంలో జగన్ రెడ్డిపై విరుచుకుపడ్డారు. సత్తెనపల్లి ప్రజలను భయపెట్టడానికి పొట్టేలును నరికినట్లు రా నరుకుతాం నా కొడకల్లారా, గంగమ్మ జాతరలో వేట తలలు నరికినట్లు రఫ్ఫా రఫ్ఫా నరుకుతామని, రాజారెడ్డి రాజ్యాంగాన్ని పల్నాడు నుండే మొదలు పెడతామని పల్నాడు జగన్ రెడ్డి అడ్డా అని ఎవరు ముందుకు వచ్చిన నరుకుతామని బహిరంగంగా ప్రకటనలు చేస్తూ, ఫ్లెక్సీలు, నినాదాలు అరుపులు కేకలు వాహనాలతో ఎదురు వచ్చిన వారిని గుద్దుకుంటూ ఇద్దరు జీవితాలతో జగన్ రెడ్డి చలగాటమాడి కనీసం వారి కుటుంబ సభ్యులనే పరామర్శించడానికి తీరుబాటు లేకుండా అధికార పార్టీపై అవాకులు చవాకులు, పోలీసులను బెదిరించడం, రెండు మూడేళ్ల అధికారంలోకి వస్తామని అందరి సంగతి చూస్తామని, కొంతమంది పోలీసు అధికారులకు సినిమా చూపిస్తామని తెగ ఉబలాడుతున్నాడని, జగన్ రెడ్డి మేకపోతు గాంభీర్యం ప్రదర్శించి వైసిపి కార్యకర్తలకు ధైర్యాన్ని నూరు పోస్తున్నాడని నాగ జగదీష్ మండిపడ్డారు. ప్రజాస్వామ్యంలో ఓడిపోయిన పార్టీ బాధ్యతలు వహించి ప్రజా సమస్యలపై పోరాటం చేయవలసిన బదులు, కుల రాజకీయాలు, ప్రాంతీయంగా రెచ్చగొడుతూ తన పార్టీ కార్యకర్తలకు డబ్బులు మద్యం, వాహనాలకు పెట్రోల్ ఇచ్చి తన బలంగా శునకానందం పొందుతున్నారని, ఇది వాపు తప్ప బలం కాదని జగన్ రెడ్డి తెలుసుకోవాలని నాగ జగదీష్ హితువు పలికారు. సత్తెనపల్లి నియోజకవర్గంలో రెంటపాళ్ళ గ్రామంలో వైసిపి నాయకుడిగా చలామణి అవుతూ 2024 ఎన్నికల్లో జగన్ రెడ్డి మాటలు నమ్మి 175కి 175 వస్తాయని జగన్ రెడ్డిపై విశ్వాసంతో కోటి యాభై లక్షలు బెట్టింగులు కాసి డబ్బులు పోగొట్టుకొని కుటుంబ కలహాలతో ఆత్మహత్య చేసుకున్నాడని జూన్ 5న జరిగిన సంఘటన జగన్ రెడ్డి ఆపద్ధర్మ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో జరిగిన దానికి కూటమి ప్రభుత్వంపై చంద్రబాబుపై ఆరోపణలు చేయడం జగన్ రెడ్డికి అలవాటుగా మారిందని, ప్రజలను నమ్మించే ప్రయత్నం చేస్తున్నాడని, జగన్ రెడ్డి ఆంధ్రప్రదేశ్‌లో ఎన్ని ప్రయత్నాలు చేసినా ప్రజలను వైసీపీని జగన్ రెడ్డిని నమ్మే పరిస్థితి లేదని రానున్న స్థానిక సంస్థలు ఎన్నికలు మరోసారి జగన్ రెడ్డికి సినిమా చూపించడానికి ప్రజల సిద్ధంగా ఉన్నారని నాగ జగదీష్ అన్నారు. ఈ కార్యక్రమంలో కాండ్రేగుల సత్యనారాయణ కుప్పిలి జగన్ మల్ల గణేష్ కాండ్రేగుల రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

# ప్రధాని నరేంద్ర మోదీ సుపరిపాలన 11 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా వికసిత భారత్ సంకల్ప సభ



**విశాఖ, (రాజధాని వార్తలు):** జీవీఎంసీ 80వ డివిజన్ బిజెపి ఇంచార్జి మారిశెట్టి భాస్కర్ రావు ఆధ్వర్యములో గవరపాలెం అంబేద్కర్ నగర్‌లో 11 సంవత్సరాలు ప్రధాని నరేంద్ర మోదీ సుపరిపాలన పూర్తి అయిన సందర్భంగా వికసిత భారత్ సంకల్ప సభ నిర్వహించడం జరిగింది. ఈ సభకి ముఖ్యఅతిథిగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు డి.పరమేశ్వరరావు విచ్చేసి వారు మాట్లాడుతూ గత 11 సంవత్సరాలలో మోడీ సుపరిపాలనలో దేశంలో అన్ని రంగాలు అభివృద్ది చెందడం జరిగిందని తెలిపారు. అనంతరం వీక్షిత్ భారత 2047 ప్రతిజ్ఞ చేయడం జరిగింది. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.అప్పారావు, ఆయుష్మాన్ భారత్ కార్డ్‌లు లబ్ధిదారులకు పంపిణీ చేయడం జరిగింది. ఈ సభలో మండల అధ్యక్షులు కె. సన్యాసి రావు, బీజేపీ జిల్లా కార్యదర్శి ఓరుగంటి నాగమణి, జిల్లా ఉపాధ్యక్షులు ఉడా రమేష్, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి కర్రి రామకృష్ణ, అసెంబ్లీ కన్వీనర్ బి.నాగేశ్వరరావు, బీజేపీ నాయకులు రాపేటి సంతోష్, యం.నాగశివ, కర్రి పరదేశి నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

# 7295 బస్సులు, 5 లక్షల మంది ప్రజలు

**- సచివాలయం యూనిట్‌గా బస్సుల తరలింపు - 26 కి.మీ.మేర యోగా విన్యాసాలు చేసేలా ఏర్పాట్లు - ప్రజల కోసం భారీగా ఆహారం, మంచినీటి ఏర్పాట్లు**
**- 4 వేల టాయిలెట్లతో స్వచ్ఛతకు ప్రాధాన్యత - యోగాంధ్ర ఏర్పాట్లపై విశాఖలో వరుస సమీక్షలు చేసిన పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ**







**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** యోగాంధ్ర కార్యక్రమానికి తరలి వచ్చే లక్షలాది మంది ప్రజలకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పగడ్బందీగా చేపడుతుంది ప్రభుత్వం...సుమారు ఐదు లక్షల మంది ప్రజలు తరలి వస్తారని అంచనా ఉండటంతో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎప్పటికప్పుడు అధికారులకు దిశానిర్దేశం చేస్తున్నారు పురపాలక శాఖ మంత్రి నారాయణ. గురువారం (ఈరోజు) ఉదయం నుంచి అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు (యోగాంధ్ర) కార్యక్రమం విజయవంతంపై వరుస సమీక్షలు చేశారు మంత్రి...ముందుగా విశాఖపట్నం జిల్లా టీడీపీ కార్యాలయంలో సహచర మంత్రులతో కలిసి పార్టీ నేతలకు పలు అంశాలపై సూచనలు చేశారు...ఉదయం 6.30 కు కార్యక్రమం ప్రారంభం కానుండటం తో గం.5.30 లోపు ప్రజలంతా వారికి కేటాయించిన కంపార్ట్మెంట్ లకు చేరుకునేలా చూడాలని 5.45 గంటల తర్వాత ప్రజలను అనుమతించడంలో ఇబ్బందులు ఉంటాయని మంత్రి స్పష్టం చేశారు..ప్రధాని భద్రతా కారణాల దృష్ట్యా కొంత ముందుగానే ప్రజలను అనుమతించరని తెలిపారు. ఆ తర్వాత ఏయూ కన్వెన్షన్‌లోని కమాండ్ కంట్రోల్ రూమ్‌కు చేరుకున్న మంత్రి నారాయణ....రవాణా, ఫుడ్ కమిటీలోని సభ్యులతో సమావేశయ్యారు...ఒక్కో సచివాలయాన్ని ఒక యూనిట్‌గా తీసుకుని ప్రజలకు రవాణా సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లు మంత్రి తెలిపారు..ప్రైవేట్ వాహనాలు, ఆటోలు కాకినాడ మొత్తం 7295 బస్సులను ప్రజల కోసం ఏర్పాటు చేసినట్లు మంత్రి నారాయణ చెప్పారు..అయితే బస్సులను ఒకేసారి కాకుండా ట్రాఫిక్‌కు తగినట్లుగా చేరుకునేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇక్కడి నుంచే సీఎం చంద్రబాబు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరయ్యారు మంత్రి. ఆ తర్వాత విశాఖపట్నం పోలీస్ కమిషనర్ సంకబ్రత బాగ్చీతో సమావేశమయ్యారు. పెద్ద ఎత్తున బస్సుల్లో ప్రజలు తరలి వస్తుండటంతో తగిన పార్కింగ్ ఏర్పాట్లు,ఒకేసారి బస్సులు వచ్చి ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడకుండా చూడాలని సీపీ బాగ్చికి సూచించారు. కార్యక్రమం ముగిసి తిరిగి వెళ్లేటప్పుడు కూడా బస్సులను ట్రాఫిక్ కు అనుగుణంగా పంపించాలని...రద్దీకి అనుగుణంగా వ్యవహరించాలని సూచించారు. అలాగే కార్యక్రమానికి హాజరవుతున్న వారికి ఆహారం, తాగునీరు, టాయిలెట్‌ల ఏర్పాటుపైనా అధికారులకు మంత్రి దిశానిర్దేశం చేశారు. మొత్తం 4 వేల టాయిలెట్‌లను ఏర్పాటు చేసినట్లు అధికారులు మంత్రికి తెలిపారు. మరోవైపు మంత్రులు పార్థసారధి, దుర్గేశ్, అధికారులతో కలిసి కంపార్ట్మెంట్ ఇన్చార్జిల మీటింగ్‌కు మంత్రి నారాయణ హాజరయ్యారు.

## సిహెచ్.ఎన్.అగ్రహారం శ్రీ మరిడిమాంబ అమ్మవారిని దర్శించుకున్న రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ & ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్, మాజీ శాసనసభ్యులు, నియోజకవర్గ టీడీపీ ఇంచార్జీ పీలా గోవింద సత్యనారాయణ





**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** అనకాపల్లి మండలం, సిహెచ్.ఎన్.అగ్రహారం గ్రామంలో శ్రీ మరిడిమాంబ అమ్మవారి పండుగ సందర్బంగా అమ్మవారిని ఆయన దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్బంగా ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు వారిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీల శ్రేణులు, టీడీపీ శ్రేణులు పాల్గొన్నారు.


# “గిరిజన బాలికల పాఠశాలలో శ్రావణ్ సందర్శన - విద్యార్థులకు భరోసా”

**- “విద్య, ఆరోగ్య రంగాల్లో సమగ్ర అభివృద్ధి దిశగా కూటమి చర్యలు” - గిరిజన సహకార సంస్థ చైర్మన్ శ్రావణ్ కుమార్, టిడిపి పాడేరు నియోజకవర్గ ఇన్చార్జి ఈశ్వరి**



**అల్లూరి జిల్లా, చింతపల్లి, (రాజధాని వార్తలు):** విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని గిరిజన సహకార సంస్థ రాష్ట్ర చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ స్పష్టం చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో విద్యారంగ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. గురువారం టిడిపి పాడేరు నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరితో కలిసి చింతపల్లిలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత బాలికల పాఠశాలను సందర్శించిన శ్రావణ్ కుమార్, అక్కడ విద్యార్థులతో సమావేశమయ్యారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బాకూరు సత్యనారాయణ రాజు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు పౌష్టికాహారంతో కూడిన భోజనాన్ని అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, మెనూను క్రమంగా అమలు చేస్తామని చెప్పారు. పాఠశాలల విద్యార్థుల శుభ్రత దృష్ట్యా గిరిజన సహకార సంస్థ (జిసిసి) ద్వారా ప్రతినెలా సబ్బులు, నూనెలు పంపిణీ చేస్తామని, సన్న బియ్యంతో భోజన సదుపాయం కల్పిస్తున్నట్లు వివరించారు. సాంకేతిక విద్యా ప్రమాణాలను మెరుగుపరిచేందుకు, ఖాళీ ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయడంపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించిందని తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేసే దిశగా ప్రభుత్వం వేగంగా ముందుకెళ్తుందని, ఏర్పడిన ఏడాది కాలంలోనే ‘సూపర్ సిక్స్’ పథకాల అమలుకు శ్రీకారం చుట్టిందన్నారు. ఇందులో భాగంగా ‘తల్లికి వందనం’ పథకం ద్వారా ఒక్కో కుటుంబంలో ఎంతమంది విద్యార్థులు ఉంటే అంతమందికి ఆర్థిక సాయాన్ని అందించేలా చర్యలు తీసుకుంటున్నట్టు వెల్లడించారు. గత వైకాపా ప్రభుత్వ పాలనలో ‘అమ్మఒడి’ పథకం కేవలం ఒక్కరికే పరిమితమై ప్రజలకు న్యాయం జరగలేదని విమర్శించారు. విద్యార్థుల ఆరోగ్య సంరక్షణలో భాగంగా యోగా నిర్వహణకు ప్రాధాన్యత ఇస్తున్నామని, ఈ నెల 21న విశాఖపట్నంలో జరగనున్న 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవానికి విద్యార్థులు, ప్రజలు భారీగా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ దురియా పుష్పలత, ఎంపీపీ కోరాబు అనూష దేవి, మండల కో-ఆప్షన్ సభ్యుడు షేక్ నాజర్ వల్లి, జనసేన మండలాధ్యక్షుడు వంతల బుజ్జిబాబు, టిడిపి మండల అధ్యక్షుడు పూర్ణచంద్రరావు, జనసేన మండల ఉపాధ్యక్షుడు కిముడు కృష్ణమూర్తి (పండు), టిడిపి నాయకుడు లక్ష్మణరావు, ఇతర కూటమి నాయకులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినిలు పాల్గొన్నారు.

# అష్టమి వార్షికోత్సవం సందర్భంగా పెళ్లికూతురు అలంకరణలో శ్రీ కనక దుర్గ అమ్మవారు





**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** గవరపాలెం శతకం పట్టు శ్రీ కనక దుర్గ అమ్మవారి ఆలయములో అష్టమి వార్షికోత్సవం సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు బోగాపురపు వెంకటరమణ (బాబు), ఉదయగిరి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఆలయ అష్టమి వార్షికోత్సవ వేడుకలు భాగంగా గురువారం ఆలయ శాశ్వత చైర్మన్, నిర్వాహకులు కాండ్రేగుల నాయుడు భాగ్యలక్ష్మి దంపతుల సౌజన్యంతో కళ్యాణ్ సందర్భంగా అమ్మవారిని పెళ్లికూతురుగా అలంకరణ చేశారు. అనంతరం ఆలయం వద్ద శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వారి కల్యాణం అశేష భక్తులుతో ఘనంగా జరిగింది. ఈ కల్యాణంలో మళ్ల రాజా లహరి, బొడ్డేడ బాలసుబ్రమణ్యం శ్రీలక్ష్మి దంపతులు. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకులు పివి రమణ, ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ భీమర శెట్టి వరాహ నూకరాజు, ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు, శ్రీ గౌరీపరమేశ్వరుల కమిటీ సభ్యులు, శ్రీ మరిదిమాంబ కమిటీ సభ్యులు, శ్రీ గౌరీ పరమేశ్వరి ప్రజా టెంట్ హౌస్, తదితరులు పాల్గొన్నారు.



Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI NO: APTEL/2019/77985, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan